


గంట పది కావొస్తూంది. నాన్న ఆఫీసు కెళ్లిపోయారు. చెల్లాయి తమ్ముళ్లు కూడా స్కూళ్లకు వెళ్లిపోయారు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అమ్మ పక్కింటి పిన్నిగారితో గామోను కబుర్లు చెప్తూంది.

గోడకానుకుని తీరిగ్గా గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాను నేను. ఇంతలో పోస్ట్ అంటూ ఒక ఉరుము ఉరిమింది. వెంటనే మెరుపులా నా మొహానికి గురిపెట్టి విసరినట్టు ఓ కవరు వచ్చి తగిలింది.

ఒళ్లు మండిపోయింది. నిరుద్యోగులంటే అందరికీ అలుసే. కోపంగా కవరుకేసి చూసాను. క్షణంలో కోపం సంతోషంకింద మారిపోయింది.

ఎప్పుడో ఏడాదిక్రితం వ్రాసిన రిటెన్ టెస్ట్ పాసయినట్టున్నాను. ఇంటర్వ్యూకు రమ్మనమని ఆఫీసువారు పంపిన ఆహ్వాన పత్రిక నా పేరుమీదే వుందికదాని ఓ రెండు మార్లు కవరును, నా పేరదే కదాని ఓనాలుగు మార్లు స్ఫురణకు తెచ్చుకున్నాను.

తరువాత రిటెన్ టెస్ట్‌లో తనకు తెలియకుండానే సహాయంచేసిన సాముఁదు కాండిడేట్‌కు థాంక్స్ చెప్పుకున్నాను. వెంటనే కిటికీదగ్గరకొచ్చి మా అమ్మను పిల్చి సంగతంతా చెప్పాను మా అమ్మ మహా సంతోషపడిపోయి పోపుల పెట్టెలోంచి సినిమా కెళ్లమని డబ్బులిచ్చింది.

నిజానికి ఇక్కడే అమ్మకు నాన్నకు తేడా. పరీక్ష రాసొస్తే చాలు పెద్దఘనకార్యం చేసొసని డబ్బులిచ్చేసేది మా అమ్మ. పరీక్ష పాసయినా సరే మార్కులురానీ చూద్దాం అని దాటేస్తాడు నాన్న

సాయంకాలం నాన్న రాంగనే అమ్మ మనవాడికి ఉద్యోగం వచ్చిందండీఅంటూ కవరందించింది. ఆయన కవరటూ, ఇటూ తిప్పిచూసింతర్వాత ఇది ఇంటర్వ్యూ కార్డే. అక్కడ సెలెక్టుకానీ అంటూ తేల్చేసారు.

'అపశకునంమాటయి,మీరూనూ వాడికేం మహారాజు తప్పకుండా ఉద్యోగం వస్తుంది' అంటూ అమ్మ నాన్న మాటలను తిప్పికొట్టింది.

'ఇంతకూ ఇంటర్వ్యూ కాకినాడలోనా' అంటూ ఇంకోమారు చదివారు.

'అవును అన్నయ్యకూడా వున్నాడుగా ఎక్కడ వుండాలన్న శ్రమకూడా తప్పింది' అన్నాను నేను

మర్నాడే కాకినాడకు ప్రయాణం నిశ్చయమైంది.

స్టేషనుకు బయలుదేరుతూంటే ఎదురింట్లో వుంటున్న ఇంకో నిరుద్యోగి కావాలని హాఛ్‌మని తుమ్మాడు.

ఓరి దుర్మార్గుడా అని మనసులో తిట్టుకుని రిక్షా ఆపమని చెప్పబోతూంటే వెనకాలే మా బామ్మ హాఛ్‌మని ఇంకో తుమ్ము తుమ్మి 'రెండు తుమ్ములు శుభసూచకం, బయలుదేరరా అబ్బీ' అంటూరిక్షావాడిని అదిలించింది. మా బామ్మ తెలివితేటలకు జోహార్లర్పించాను.

మైల్స్ హోరాహోరి పోరాడి కొంత దూరం, సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో సర్కస్

చేస్తూ మిగతాదూరం ఎలాగయితేనేం కాకినాడ కొచ్చిపడ్డాను

రిక్షావాడు ఎక్కడికెళ్ళాలి బాబూ అన్నప్పటికిగాని నాకు అడ్రసు మరచిపోయిన సంగతి గుర్తుకురాలేదు. తల పూర్తిగా బద్దలు కొట్టుకోకముందే వాళ్ళుంటున్న పేట గుర్తుకు వచ్చింది.

రిక్షాలో ఆ పేటంతా తిరుగుతూంటే అకస్మాత్తుగా ఓ నాటాలోంచి రివ్వుమంటూ ఓ ఆఫీసుఫైలూ, దాన్ని తరుముకుంటూ ఒక అట్లకాడ రిక్షాలోకి వచ్చి పడ్డాయి.

అష్టవంకరులు తిరిగిన ఆ అట్లకాడ మా వదినదని ఆ ఆఫీసుఫైలు ధ్వనపరిచింది.

వెంటనే రిక్షా ఆపించి ఇంట్లోకెళ్ళాను. లోపల కడుగు పెట్టంగానే ఇంకో ఆఫీసుఫైలుతో అన్నయ్య వంటింట్లోకి చూస్తున్నాడు వదిన ఇంకో ఆయుధంకోసం కాబోలు వెతుకుతూంది. అడుగులు చప్పుడు విని అప్పుడే చేరికించుకున్న గరిట పారేసి 'రా, రా ఇదేనా రావటం' అంటూ ఎదురొచ్చింది. మా అన్నయ్యకేసి తిరిగి 'ఆ ఫైలు అవతల పెట్టండి. ఆదివారం కూడా ఆఫీసుపనే' అంటూ ఫైలును అన్నయ్య చేతుల్లోంచి లాక్కుంది.

వదిన సమయస్ఫూర్తికి మెచ్చుకోకుండా వుండలేక పోయాను. ఇలాటివారు వుండటంబట్టే కదా నాలాటి వాళ్ళు అడ్రసులు లేకపోయినా ఇళ్ళు సుళభంగా కనుక్కుంటున్నారు అని అనిపించింది. మా అన్నయ్యకు ఇంటర్వ్యూ వచ్చిన సంగతి చెప్పాను.

అవీ ఇవీ మాట్లాడుకున్న తర్వాత 'నా ఫ్రెండొకడు ఈ వూళ్ళోనే వుంటున్నాట్ట చూసొస్తాను' అని లేచాను.

'అప్పుడే మొదలయిందా తిరుగుడు. 'రేపటికి పిసేస్ అవు' అన్నాడన్నయ్య.

మా వదినవేపు చూసాను 'ఇప్పుడే కదా వచ్చాడు. అలా తిరిగేసివస్తే ఫ్రెష్‌గా వుంటుంది వెళ్ళనియ్యండి' అంటూ నన్ను వెనకేసు కొచ్చింది

అన్నయ్య ఆఫీసువాళ్ళు ఎవరో రావటంతో అన్నయ్య ఆ లోకంలో పడ్డాడు. వదిన వంటింట్లో కెళ్ళింది. ఈ సందట్లో నేను చల్లగా బయటకు జారుకున్నాను.

స్నేహితుడి పేరు భాస్కరమూర్తి. మెయిన్‌రోడ్డులో అడ్డగాడిదలా తిరుగుతున్నవాడిని పట్టుకోవటం ఏం అంత కష్టం కాలేదు. కుశల ప్రశ్నలయ్యాక నే వచ్చిన పని చెప్పాను వాడికి. వాడప్పుడే నాకు ఉద్యోగమొచ్చినంత సంతోషపడిపోయి 'ఈ శుభ సమయంలో ఏ సినిమా కెళ్ళాలి' అంటూ పాటందుకున్నాడు.

మళ్ళీ అంతలోనే ఆపి మన కలలు ఫలించబోతున్నాయి కాబట్టి 'తేరే మేరే సప్నే'కి వెళ్దాం పద' అన్నాడు. ఇద్దరం హాలు వైపుకు దారితీసాము.

సినిమా అంటే నాకోసంగతి గుర్తుకొస్తూంది. ఈ సంగతి సోదర నిరుద్యోగులకు ఎంతో లాభదాయకమైంది

నిజానికి ఉద్యోగులకంటె, విద్యార్థులకంటె, నిరుద్యోగులకే డబ్బు ఎక్కువ ఖర్చవుతుంటూంది.

డబ్బంతా నీళ్ళలా ఖర్చయిపోతున్నవారే నిరుద్యోగులు అని నా అభిప్రాయం. అసలు నీరుద్యోగంలోనే వుంది నీరు అన్న పదం. నీరుద్యోగం కాస్తా కాలక్రమేణ రూపాంతరం చెంది నిరుద్యోగమయింది.

అందుకని కొందరు తెలివైన నిరుద్యోగులు కొన్ని 'ప్లాట్లు' తయారు చేసారు. అందులో ఒక పద్ధతి :

ఊళ్ళో కొత్త సినిమా రిలీజవుతుందంటే వీరికో కొత్త 'వే' కన్పడినట్టు. ఆ థియేటర్లన్ని, పనీ పాటూ వుండదు కాబట్టి పొద్దున్న లేచి క్యూలో నిల్చోవాలి. నీ టికెట్టు ఒకటో రెండో కాకుండా, అమ్మాయిల దగ్గర బతిమిలాడో ప్రాగులాడో ఎలాగో రెండు టికెట్లు సంపాదించాలి.

ఇంక తెలిసిందే బ్లాకు అమ్మకమేగా అనుకోవచ్చు అలా మనం బ్లాకులో అమ్మితే ఎంత పరువు నష్టం. పైగా చాలా మందికి ఉదాహరణకు పోలీసులు, హాలు మేనేజరు, గూండాలు, వీరందరికి వాటాలు పంచవలసి వస్తుంది. ఆ టికెట్లు, ఫస్టు షో అనుకోండి, తీసుకొని ఆరు, ఆరున్నర దాక గేటు దగ్గర కాపలా వెయ్యాలి.

కొత్త జంటలు వచ్చేదాక ఆగండి. వాళ్ళు కొద్దిగా ఆలస్యంగానే వస్తారు. అప్పటు, ముప్పటు, అలకలూ...ఇవన్నీ తీర్చుకుని రావాలంటే ఆలస్యమవుతుంది మరి. వాళ్ళు రిక్షాయో, స్కూటరో దిగంగానే టికెట్లంటూ పరిగెత్తకూడదు. ఎవరో స్నేహితుడికోసం ఎదురు చూస్తున్నట్లు కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ దొంగ చూపులు చూస్తూండాలి.

వాళ్ళు కౌంటర్ దగ్గరకెళ్ళి హౌస్ ఫుల్ అని వేలాడగట్టిన బోర్డును చూసి మొహాలు వేలాడేసుకొస్తారు. అప్పుడు మీరు వాళ్ళ దగ్గరకెళ్ళి ఇంగ్లీషులో మొదలెట్టాలి.

'మా స్నేహితుడొకడొస్తాడని టికెట్లు తీయమన్నాడు. నేను వచ్చేసరికి కౌంటరు మూసేసారు. బ్లాకులో (ఈ మాటలు ఒత్తి పలకాలి) కొనాల్సి వచ్చింది. వాడింత వరకు రాలేదు. మీకు కావల్సితే తీసుకోండి.'

ఈ మాటలన్నీ అయ్యగారితో మొదలెట్టి అమ్మగారితో పూర్తి చేయాలి.

సాధారణంగా ఏ కొత్త మొగుడూ 'చెప్ సినిమా వద్దు. ఏమొద్దు' అని భార్యను గుంజుకుపోడు. కొని తీరతాడు.

వాళ్ళనా పంపించేసే కొత్త జంటకు వేట.

అయితే పాటించవలసిన నియమాలు కొన్ని వున్నాయి. ఎప్పుడూ అమ్మాయిలకు టికెట్లు అమ్మకూడదు. ఎందుకంటె వాళ్ళెంత చదువుకున్నవారైనా డబ్బుల దగ్గర వెనుకంజ వేస్తారు. అంతా విని 'వద్దు లెండి' అని మొహం మీద కుండ బద్దలు కొట్టినట్టు చెప్పి మరీ పోతారు. ఇలా అయినా నయమే. కొందరు సరిగ్గా డబ్బులు తెమ్మకుంటారు. ఇంకా మాట్లాడితే ఒకటి రెండు పైసలు తక్కువ కూడా.

మొదట్లో కొందరి దగ్గర నేనిలాగే నష్టపోయాను.

ఇద్దరం సినిమాహాలు దగ్గర కొచ్చాము. కాని మేము వెళ్ళేసరికే అక్కడ 'క్యూ' పెరిగిపోయింది. టికెట్లమీద ఆశ వదులుకున్నాము ఐనా కాసేపు అమ్మాయిలనైనా చూదొమ్మని 'క్యూ'లో నిల్చున్నాము టిక్కెట్లు ఇవ్వటం మొదలెట్టారు. మాముందు వాడికి కూడ టికెట్టు దొరికింది. విజయగర్వంతో క్యూ నుంచి వెళ్ళినందుకు అభినందించు

గాంటూ కొంటరులో చెయ్యి పెట్టాను.
లోపల చెయ్యి పెట్టంగానే టప్పున తలుపులు దించేసాడు.

కెవ్వుమన్నాను వాడు తలుపులు తెరిచి 'సారీ' అంటూ చెయ్యి బయటకుతోసి మళ్ళీ తలుపేసుకొన్నాడు.

థియేటరు బయట కొచ్చేసాంటే చాలమంది కొత్త జంటలు అప్పుడే రిక్షాలు దిగుతూ కన్పించారు. ప్రాణం ఉసూరు మంది. ముందొచ్చుంటే ఎంత లాభంగా వుండేది.

అక్కడనుంచి పార్కులోకొచ్చి కూర్చున్నాము. ఇంటర్వ్యూ ఆఫీసు ఎక్కడో కనుక్కున్నాను! వాడిని కూడా సాయంరమ్మన్నాను. కొంచెంసేపు తినిగేసి ఇంటికొచ్చేసాను.

ఆ రాత్రి మా అన్నయ్య ఇంటర్వ్యూలోని మెలకువలు కొన్ని బోధించాడు. పొద్దునలేచి ట్రిమ్ముగా తయారయ్యాను. ఒకటికి రెండుసార్లు ఆంజనేయ దండకం పఠించి మంచిశకునం చూసుకొని బయలుదేరాను.

దారిలో భాస్కరమూర్తి కలిసాడు. వాడు మరికొన్ని నీతులు, జాగ్రత్తలు వల్లించాడు. ఇంటర్వ్యూ జరిగే ఆఫీసు దాక వాడు తోడు వచ్చాను.

# నిరుద్యోగికష్టాలు..

లోపలకెళ్ళాను. ఆవేళ ఇంటర్వ్యూ కొచ్చిన అభ్యర్థుల సంఖ్య బాగానే వుంది. పదిమంది అమ్మాయిలు. పదిమంది అబ్బాయిలు.

ప్రతిఒకడు మిగతాందరిని శత్రువుల కింద చూస్తున్నాడు. నేనుకూటుకు తొమ్మిదిమంది మగవాళ్ళను తప్పించి మిగతందరిని అభిమానంగానే చూస్తున్నాను.

అందులో ఒకమ్మాయి ఆధునికంగా అలంకరించుకుంది. చాలా బాగుంది. నేనే ఇంటర్వ్యూ బోర్డులో మెంబరయి వుంటే ఈ అమ్మాయినే ఎన్నిక చేస్తాను.

మరుక్షణంలోనే నా తప్పు తెలిసొచ్చింది.

'ఛీ, ఛీ ఇదా ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు చేసుకోవలసిన అలంకరణ. ఆఫీసు పరువూ మర్యాదా మంట కలిసిపోదూ.

'నేనే ఇంటర్వ్యూలో మెంబరయితేనే చస్తే ఇలాటమ్మాయిలకు ఉద్యోగాలివ్వను.'

నా వాదన నాకెంతో నచ్చింది.

ఇంతలో కాకీ టోపీ వాడొచ్చి 'అపర్ణ ఎవరండి ?' అన్నాడు.

ఆ ఆధునిక యువతి లేచి ఒళ్ళంతా వూపుకుంటూ లోపల కెళ్ళింది. పది నిముషాలయింది.

ఆ అమ్మాయి రాలేదుకానీ మళ్ళీ ప్యూన్ వచ్చేసి ఈసారి 'నరసింహంగారూ ...నరసింహంగారూ...' అని పిల్చాడు.

అందరికళ్ళు నరసింహంవేపు తిరిగాయి.

నరసింహం లేచి పిల్లిలా లోపల కెళ్ళాడు.

మరో పదినిముషాలకి ప్యూన్ వచ్చి ఇంకోర్ని పిలిచాడు. దీనినిబట్టి ఇంటర్వ్యూ అయిపోయిన వాళ్ళందరినీ అటునుంచటే తరిమేస్తున్నారని అర్థమయింది.

ఇంకొంత మందికి పిలుపులొచ్చాయి. కొంచెం సేపటికి ప్యూన్‌వచ్చి 'నిత్యానందంగారూ...నిత్యానందంగా రెవరండీ' అనడిగాడు, అందరినీ కలియచూస్తూ.

నా మొహం చూస్తే కనిపెట్టలేడూ అనుకుంటూ,

ఒకచేత్తో గుండెను, రెండోచేత్తో సర్టిఫికెట్లను పట్టుకొని లోపలకి నడిచాను.

లోపల ఆకలిగొన్న పులుల్లా ఇద్దరు కళ్ళద్దాలవాళ్ళు ఒక బుర్రమీసాలాయన, ఒక బట్టతలాయన వున్నారు.

'మీరేనా నిత్యానందం అంటే?' అనడిగాడు బుర్రమీసాలు.

'అవునండీ' అన్నాను, ఫైలు టేబిలు మీద పెట్టుతూ.

బట్టతలాయన కూర్చో మన్నాడు.

ఎలాగయినా పెద్దమనిషి తరహా వేరు. కూర్చున్నాను.

'బియ్యేస్సీలో మీ సబ్జక్ట్సు ఏమిటన్నారు' అన్నాడు కళ్ళద్దాలు.

నేనేమీ అనలేదే. బహుశా ఈయన చెవిటి వాడయుండొచ్చు. కప్పిపుచ్చుకోడానికే అడుగుతున్నాడని,

'ఎమ్. పి. సి.' అని గట్టిగా అరిచాను.


ఉలిక్కి పడ్డాడు.

'నాకేం చెప్పడులేదు' అని గుర్రుమన్నాడు.

నా అంచనా తప్పయి పోయినందుకు నాలిక కరచు కున్నాను.

'న్యూటన్ లాస్ ఏమిటో చెప్పగలరా ?' ప్రశ్న.

కోసంగా వున్నవాళ్లెవ్వడూ దొంక



తిరుగుడుగానే ప్రశ్నలేస్తారు. భాస్కరమూర్తి ఇచ్చిన సలహా గుర్తుకొచ్చింది.

న్యూటన్ కొచ్చిన నష్టమేమిటో నాకెంతకూ బుర్రకు తట్టలేదు.

బుర్ర అడ్డంగా వూపాను.

'రిలటివిటీ గురించి కొంచెం చెప్పండి' మళ్ళీ ఆ శాస్త్రియే.

ఈసారి జవాబుకు బదులు ఇంట్లో వెడ్డింగ్ దారాలు ఎక్కడ పెట్టేసానని ఆలోచించాను.

బుర్ర మీసాలాయన అందుకున్నాడు. 'మీరేం ఆటలు ఆడేవారు?'

'అన్ని ఆటలు ఆడాను' అన్నాను.

వాడు అనుమానంగా, అర్థం.కానట్టుగా చూసాడు.

అప్పటికి కాని నేను ఎంత మర్మగర్భంగా మాటాడిందీ తెలియలేదు.

వాడు కొన్ని ప్రశ్నలేసాడు. నేను టకీటకీమంటూ ఇలా జవాబులిచ్చాను.

'ఆషెష్ అంటే?'

'బూడిద.'

'రబ్బరంటే?'

'పెన్సిల్ గీతలను తుడిపేది.'

'వాలీ అంటే?'

డిటెక్టివ్ అని చెప్పడమా లేకపోతే సుగ్రీవుడన్నని చెప్పటమాని కాసేపు తటపటాయించాను.

ఇంతలోకే ఇంకో ప్రశ్న అందుకున్నాడు.

'జ్యూసంటే ఆట మధ్య మధ్యలో ఇచ్చే డ్రింకు. ఇది నిమ్మకాయ జ్యూసయినా అయుండొచ్చు లేకపోతే ఆరంజయినా అయివుండవచ్చు'

'జ్యూస్ కాదండీ, డ్యూస్ ... డ్యూస్ టెన్నిస్‌లోది'

అందరూ ఒక్కసారి గొల్లుమనివన్నారు.

పది నిముషాలసేపు నవ్వుతూనే వున్నారు.

నాకేం పాలుపోక కాసేపు తలతో పేలు వెతుక్కున్నాను.


ఆఖరకు ఓ నాలుగు కళ్ళ మనిషి నవ్వు నుంచి తేరుకుని 'పోనీ అభిజ్ఞాన శాకుంతలం ఎవరు వ్రాసారు?' అనడిగాడు.

'కాళిదాసు' సునాయాసంగా చెప్పేసాను.

కాళిదాసు నాకింత బాగా గుర్తుండటానికి కారణం ఆయన కూతురు శకుంతల మా పక్కింటవమ్మాయి కావటమే.

తర్వాత బయటకొచ్చేసాను. సాధారణంగా ఇంటర్వ్యూలలో అభ్యర్థి తప్పు చెప్పేదాక వుంచి బయటకు పంపుతారు. నా విషయంలో ఇది తారుమారయిందన్న సంగతి కొంతకాలానికిగాని తెలియలేదు.

ఇంటర్వ్యూలో నాకు అసంతృప్తి కలిగించిన విషయం ఎవరూ సినిమాలను గురించి ప్రస్తావించకపోవటం.



బయట భాస్కరమూర్తి కాచుకుని వున్నాడు.

'ఎలా చేసావురా' అనడిగాడు చూసి.

'బ్రహ్మాండం బద్దలయిందనుకో. అన్ని ప్రశ్నలు దంచి పారేసాను. హోటలుకు పోదాం పద.'

ఇద్దరం ఓ పెద్ద హోటలులోకి దూరాము.

తిన్నగా ఫామిలీ సెక్షనులోకి ప్రవేశించాము. హోటల్స్‌లో సాధారణంగా రెండు రకాలుగా బిల్లులు ఎగ్గొట్టొచ్చు.

ఒక పద్ధతి. దీనిని ముఖ్యంగా భావి నిరుద్యోగులు అంటే విద్యార్థులు, చిన్న సైజు ఉద్యోగులు ఆచరిస్తారు.

ఒక టేబిలుదగ్గర కూర్చుని సుష్టుగా తిని, చేయి కడుగుకున్నతర్వాత పక్క టేబిలు దగ్గర కాఫీ మటుకు త్రాగి దాని బిల్లు మాత్రం యిచ్చేయటం.


రెండవ పద్ధతి. ఇప్పుడు మేము ఆచరించేది. అయితే ఎలా ఎగ్గొట్టటం? అబ్బే చాలా సులభమండీ.

సుష్టుగా తిని బిల్లు తీసుకోండి. తరువాత బయటకు హుందాగా నడచి రండి. మేనేజరు లేక ప్రొప్రయిటర్ బల్లదగ్గరకు వచ్చినప్పుడు వెనక్కు తిరిగి,

'సరళా బిల్లు నీదగ్గరే వుందికదూ.' అని నింపాదిగా బయటకొచ్చి అక్కడ నుంచి పరుగుడు పందెం మొదలెట్టాలి. ప్రొప్రయిటర్ ఆ సరళకోసం చూస్తూనే వుంటాడు పాపం.


**1972లో మీ అదృష్టము**

మీ జాతకముతో కూడా ఏదైన ఒక పువ్వు పేరు వ్రాసి ఒక పోస్టు కార్డుమీద తెలుపండి.



రు. 1.25కు రాబోవు 12 నెలలలో మీకు సంబంధించిన వివరాలు, వ్యాపార లాభనష్టములు, ప్రమోషను,ఉద్యోగంలో మార్పు, జీవనం, వివాహం,సుఖసంతోషములు తెలుపుతూ, దుష్టనక్షత్రాలమండి మిమ్ము కాపాడుకొను మార్గంతో సహా తెలుపగలము. ఒక దఫా చూచిన మీరు సంతృప్తి పొందగలరు.

SHRI SARASWATI
JYOTISH ASHRAM,
(APM) BEAS (Amritsar)


# నిరుద్యోగ'ష్టాలు...

నిరుద్యోగులం కాబట్టి ఫామిలీ రూములో కెళ్ళాము. అక్కడ రెండు రెండు జడలు ఒక మగలుంగీ రెండు ఆడలుంగీలు వున్నారు.

వాళ్ళను చూడంగానే రెట్టించిన ఉత్సాహంతో ఒకేసారి మూడు రకాల స్వీట్లుకు ఆర్డరిచ్చాను.

తరువాత వాడి కిష్టమయిన పెసరట్టు, నా కిష్టమయిన రవ్వ దోశెలు కానిచ్చాము.

బోర్నవిటాకు ఆర్డరిచ్చాను.

బోర్నవిటాలు బిల్లు తెచ్చి పెళ్ళాడు సర్వారావు. బిల్లుచూసి తలెత్తేసరికి గుండె ఆగినంత పనయింది.

తల తిరిగిపోయింది. ఖాళీగా వున్న పర్సును తలచుకొని కాదు ఎదురుగా ఖాళీగా వున్న కుర్చీలను చూసి.

ఎప్పుడు వెళ్ళిపోయారో ఏమో. తినే సారస్యంలో గమనించనే లేదు.

మూర్తి మెల్లగా నవ్వుతున్నాడు. వాడి పళ్ళమధ్య వున్న సొపరును లాగి కుర్చీలవేపు చూపించాను.

వాడు గతుక్కుమన్నాడు. ఈ పరిస్థితిని ఎలా ఆదుకోవాలో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

'ఇప్పు డెలాగా?' గొంతులో ఏడుపు జీర.

'ఒక్కటే మార్గం'

'ఏమిటి!' ఆశగా చూసాడు.

'నువ్వు వప్పారుబ్బు. నేను గ్లాసులూ. పళ్ళేలు కడిగేస్తాను' ఈ మాటలను పూర్తిచేయకముందే కళ్ళు తేలేసి కింద పడిపోయాడు మూర్తి.

గుండె ఝల్లుమంది. వాడు పడిపోయినందుకు కాదు. వాడి పనంతా నా నెత్తిమీద పడుతుందేమో నన్న భయంతో రెండు మూడు మార్లు కదిపి చూసాను. కదల్లేదు. శ్వాశ ఆడుతుందేమో చూసాను. అమ్మయ్య బతికే వున్నాడు.

ఈ లోపల ప్రొప్రయిటరు సర్వర్లు అందరూ పరిగెత్తుకొచ్చేసారు. ఓ ఇద్దరు సర్వర్లు రెండు టేబుళ్ళను దగ్గరకు లాగి మూర్తిని దానిపై పడుకోబెట్టారు.

'వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. అప్పుడప్పుడు ఇలాగే వస్తూంటుంది. పైన ఈ తిండీ.' తప్పించుకో చూసాను.

'లాభం లేదు. మీరు వెళ్ళటానికి వీల్లేదు.' అని అక్కడున్న సర్వర్లందరినీ పొమ్మన్నాడు.

నా పై ప్రాణాలు పైనే ఎగిరి పోయాయి.

ప్రొప్రయిటరు నా దగ్గరకొచ్చి చేతులు పట్టుకొని, 'ఎందుకొచ్చిన గొడవ చెప్పండి. పదిరోజుల క్రితం నానబోసిన పప్పు రుబ్బటానికి ఇవ్వాళటికిగాని మనిషి దొరక లేదు...ఈ పని మీ దగ్గరుంచండి.' అంటూ బేరానికి దిగాడు.

'అబ్బే అదేం కుదర్దు. ఈ కేసు ఇక్కడ తేలార్సిందే. పెద్ద బాబాయి ఒకడు ఫుడ్ ఇన్స్పెక్టరు. పిలిపిస్తాను' బెట్టు చూపించాను, ఇదే సమయం దొరికింది కదాని.

'ఈ పాతిక వుంచండి సార్. ఇక వూరుకోండి సార్' అన్నాడు బతిమలాడుతూ.

'సరే' ఒప్పుకున్నాను.

మూర్తి కాళ్ళుచేతులు కొట్టుకోవటం మొదలెట్టాడు.

వాడి కాళ్ళు వచ్చి నా నడుముకు పరిగేలా తగిలినయి. తూలిపడ్డాను.

ప్రొప్రయిటరు సర్వర్లను పిలిచి కాళ్ళు గట్టిగా పట్టుకోమన్నాడు. డబ్బులు తీసుకుంటూంటే మళ్ళీ ఈసారి చేతులు డొక్కలో తగిలినయ్.

పరిస్థితి విషమిస్తుందని వెంటనే హాస్పిటల్‌కు రిక్షా మాట్లాడాడు.

కొంచెంసేపటికి కాళ్ళుచేతులు కొట్టుకోవటం మానాడు.

రిక్షా ఎక్కించి నేను గట్టిగా పట్టుకున్నాను.

రిక్షా మలుపు దాటంగానే 'నీకు బుద్ధుందా' అంటూ విరుచుకుపడ్డాడు మూర్తి.

చచ్చిన మనిషి లేచి మాటాడినా నేనంత అదిరిపడుండేవాడినికాను. 'ఏమిటిందాక అలా పడిపోయావ్. ఇప్పుడెలావుంది?' ఆదుర్దాగా అడిగాను.

'రాయిలా వున్నానుగాని. మరీ పాతికనా తీసుకోవటం. నేనయితేనా వంద గుంజేవాడిని' అన్నాడు కోపంగా.

'అయితే నువ్వు నిజంగా ఇందాక ...',

'ఆ. అప్పుడూ బాగానే వున్నాను. అప్పుడలా వేషంవెయ్యకపోతే ఇప్పుడిద్దరం అంట్లు తోముతుండేవాళ్ళం' విడమరచి చెప్పాడు.

'పైగా రెండు మార్లు కాళ్లతో చేతుల్తో హెచ్చరించాను కూడా. నువ్వు గ్రహించలేదు.'

'బ్రతికించావ్. ఆ కోపంలో లేచి కూర్చుని వుంటే...'

'ఆమాత్రం నాకు తెలియదా గానీ, నువ్వంత తక్కువకు లొంగిపోవటం చూసే ఇవి తెచ్చాను' అంటూ జేబులోని నోట్ల కట్ట బయటకు తీశాడు.

'ఓరి పిడుగా' వాడి నభినందించాను.

తర్వాత డబ్బును సరిసమానంగా పంచుకున్నాము.

కానీ ఈ పద్ధతి క్షేమదాయకం కాదని సోదర నిరుద్యోగులకు హెచ్చరిక.

ఆమర్నాడే మా వూరికి తిరుగుప్రయాణం కట్టాను.

'అప్పుడే ఎందుకు? కొన్నిరోజులాగి వెళ్ళు' అన్నా డన్నయ్య.

అక్కడ ఇంటర్వ్యూ కార్డులు వస్తుంటాయి అని నచ్చచెప్పాను.

స్టేషనుకు మూర్తి వచ్చాడు.

ఆ భాస్కరుడు పన్నెండు గంటలు మాత్రమే వూళ్లో వుంటే ఈ భాస్కరుడు ఇరవైనాలుగు గంటలూ వూళ్లోనే తిరుగుతూంటాడు.

బండి ఖాళీగానే వుంది. తలుపుదగ్గరగా చోటు సంపాదించాను.

'త్వరలోనే నేను ఢిల్లీ వెళ్ళొచ్చురా' అన్నాడు.

'అంతదూరం అప్లయి చేసావేమిటి?'

'తప్పేముంది? టు బర్డ్స్ అట్ వన్ షాట్. మనకొచ్చే ఉద్యోగంతో ఇండియానే పూర్తిగా చూడలేము. ఇంటర్వ్యూల ధర్మమాని నాలుగు పెద్ద వూర్లయినా చూసి రావచ్చు' జవాబిచ్చాడు.

'టైపు ఎగ్జామినేషన్‌కు వెళ్ళావుగా ఏమయింది?'

'ఏమవుతుంది? నెలానెలా ఆరు రూపాయలిచ్చి టైపు నేర్చుకోమనేవాళ్ళు. ఇదీ బానే వుందనుకొని ఒక నెల నేర్చుకోవటం ఇంకో నెల సినిమాలకు ఖర్చు పెట్టుకోవటం చేస్తున్నా. హఠాత్తుగా ఒక రోజు మా నాన్న 'పరీక్షకు డబ్బు కట్టాను పోయి కూర్చో' అన్నాడు. పరీక్షలో వాడేదో ఇచ్చి - పావుగంటలో కొట్టమండా అన్నాడు. అలవాటు లేక ఆ ఖాళీల్లో వేళ్లు ఇరుక్కుపోయాయి. బయటకు లాక్కొనేసరికి పావుగంటయిపోయింది' అన్నాడు నవ్వుతూ.

ఈ పెద్దవాళ్లమీద ఒక్కసారిగా కోపం వచ్చింది. పార్లమెంటులో ఇన్ని బిల్లులు ప్రవేశపెడుతున్నారు కదా. వాటిలో నిరుద్యోగులకు కూడా కొన్ని సదుపాయాలుండేలా బిల్లు ప్రవేశపెట్టాలి.

ఒకటి. నిరుద్యోగ సంఘాలను ప్రభుత్వం వెంటనే గుర్తించాలి.

రెండు. సంఘంలో ముఖ్యంగా ఇండ్లలో వీరికి గౌరవ ప్రపత్తులు వుండేలా శాసనం ఒకటి చేయాలి.

మూడు. ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజి కార్డు చూపించిన ప్రతివారికి సినిమాల్లో, బస్సుల్లో, రైళ్లలో ప్రయాణం ఉచితం చేయాలి. నాలుగవది ఉద్యోగాలకు వయసు పరిమితి ముప్పయికి పెంచటం...ఇంతలో చెవులు గింగిర్లెత్తేలా గార్డు విజిలేసుకుంటూ వెళ్లాడు. మూర్తికి కనబడేదాకా చెయ్యూపి లోపలకొచ్చి కూర్చున్నాను. బండి మావూరి 'ఔటర్'లో ఆగుతే బాగుండును.

తరువాత వచ్చే ఇంటర్వ్యూవరకు ఎలా కాలం గడపాలో తెలియలేదు. గోళ్లవైపోమారు చూసుకున్నాను. రెండురోజుల్లో బాగానే పెరిగాయి.

**కాయధాన్యములు - గుణాలు:**

# గోధుమలు

గోధుమలు వేడిచేసి అరుగుతాయి. ఇవి మన శరీరానికి ఇతర ధాన్యాలన్నింటి కంటే ఎక్కువ బలాన్ని యిస్తాయి. రక్తాన్ని వృద్ధి పొందిస్తాయి.

డైబిటిస్ కలవారికి మేలు చేస్తాయి. ఉబ్బురోగం గలవారికి, వాతరోగులకు, గాయాలు తగిలిన వారికి, అగ్నితప్తమయిన వారికి మిక్కిలి పథ్యంగా ఉంటాయి.

కాకతత్వం గలవారికి— గ్రహణి, కడుపుబ్బు, అగ్నిమాంద్యం అజీర్ణం కలుగజేస్తాయి.

మనదేశంలో సాధారణంగా గోధుమ పిండితో పూరీలు, సుక్కారొట్టెలు, చపాతీలు, పరోటాలు, కొన్ని రకాల పిండివంటలు చేస్తుంటారు. గోధుమ నూకతో ఉప్మా, ప్రసాదం, హల్వా మొదలయినవి చేస్తూంటారు. ముతక గోధుమ నూకతో అన్నం వండుకొని కొంతమంది తింటూంటారు.

గోధుమరొట్టె వేడిచేసి అరుగుతుంది. బలాన్ని యిస్తుంది. వీర్యపుష్టి చేకూరుస్తుంది. రక్తాన్ని పెంపొందిస్తుంది. ఉబ్బు రోగులకు మంచిది. శరీరంలోని నీటిని తీసి వేయడానికి దోహదం చేస్తుంది. రాత్రి పిండి నానబెట్టి ప్రొద్దుట చేసిన రొట్టె మిక్కిలి ఆరోగ్యకరమైనది. పిండిని నానబెట్టకుండా కాల్చిన రొట్టె కడుపులో వాయువుని బంధిస్తుంది. గ్రహణి పట్టుకోవచ్చు.

నేతితో కాల్చిన లేక వేచిన గోధుమ పిండి వంటకం, వాత పైత్య రోగులకు హృద్రోగులకు పథ్యమయినది. వీర్యవృద్ధిని బలాన్ని చేకూరుస్తుంది. కాని ఆలస్యంగా జీర్ణమవు తుంది. పొట్టను, స్ప్లీనకు చెరుపు చేస్తుంది.

గోధుమ అన్నం మొదట వేడిచేసి ఆ తరువాత సమశీతోష్ణాన్ని కల్గిస్తుంది. డైబిటిస్ గల వారికిది మేలు చేస్తుంది. దేహపుష్టిని, శక్తిని యిస్తుంది. హృదయ దౌర్బల్యం గలవారికి, దగ్గు గలవారికి యిది మేలు చేస్తుంది. ఆలస్యంగా జీర్ణమవుతుంది.

గోధుమ నూకల జావ పథ్యమయినది. వర్తిదోషాన్ని, శీతపైత్యాన్ని హరిస్తుంది. బలాన్ని యిస్తుంది. అధికంగా పుచ్చుకుంటే ప్రేవులకు కీడు వాటిల్లుతుంది.

బాదంపప్పుతో చేసిన గోధుమజావ దగ్గును, కిడ్నీస్‌లోని నొప్పిని ఉపశమింప జేస్తుంది. హృదయానికి బలాన్ని యిస్తుంది. దీనిని తేనెతో కలిపి పుచ్చుకో కూడదు.

గోధుమనూక పాయసం లేదా ప్రసాదం మంచి రుచిగా ఉంటుంది. వాతపైత్యాన్ని పోగొడు తుంది. శక్తి నిస్తుంది.

గోధుమలు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. దోసకాయ లేక ములుదోస కాయ, 2. బెల్లం, 3. పంచదార, 4. గులకందు, 5. బూడిద గుమ్మడికాయరసం.

**సేకరణ ఆకుండి నారాయణమూర్తి**